www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 18 నవంబర్ 2024

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంను ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. నియోజకవర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నియోజకవర్గ, మండల స్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

నారా రామ్మూర్తికి కన్నీటి వీడ్కోలు

- సంతాపం తెలిపిన గవర్నర్
- సినీ ప్రముఖులు, ఎంపిలు, ఎమ్మెల్యేల నివాళి
- పాడె మోసిన చంద్రబాబు, నారా లోకేష్
- తలకొరివి పెట్టిన కొడుకు నారా రోహిత్
- అంతిమయాత్రలో నారా, నందమూరి కుటుంబ సభ్యులు

రామ్మూర్తి పార్థివదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వారి కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి- రామచంద్రపురం (చంద్రగిరి): శనివారం హైదరాబాద్ గచ్చిబౌలి ఏఐజి హాస్పిటల్‌లో అనారోగ్యంతో రామ్మూర్తి నాయుడు (72) మరణించారు. ఆయన పార్థివదేహాన్ని మంత్రి నారా లోకేష్, నందమూరి రామకృష్ణ ప్రత్యేక విమానంలో ఆదివారం ఉదయం 8 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టిడిపి నాయకులు, అధికారులు ప్రత్యేక వాహనంలో నారావారిపల్లెకు తీసుకొచ్చారు. చంద్రబాబు ఇంటి ఆవరణలో రామ్మూర్తి పార్థివ దేహానికి పూలమాల వేసి కన్నీటితో కుటుంబసభ్యులు శ్రద్ధాంజలి ఘటించారు. తమ్ముడు నారా రామ్మూర్తి నాయుడు అనారోగ్యంతో మరణించడంతో నారా చంద్రబాబు నాయుడు కన్నీటిపర్యంతమయ్యారు. తమ్ముడి కొడుకులు నారా గిరీష్, నారా రోహిత్, తమ్ముడి భార్య ఇందిరకు తాను అండగా ఉన్నానంటూ ధైర్యం చెప్పారు. రామ్మూర్తి నాయుడున్ని సందర్శించేందుకు పోలీసుల బందోబస్తు నడుమ విఐపిలు, టిడిపి శ్రేణులకు, ప్రజలకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు అంతిమయాత్రలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రామ్మూర్తి నాయుడు అంతిమయాత్రలో పాల్గొనేందుకు వచ్చిన అశేష జనవాహినికి స్థానికులు తాగునీరు, భోజనాలు, కూర్చోవడానికి ప్రత్యేకంగా షెల్టర్లు ఏర్పాటు చేశారు. తిరుపతి అడిషనల్ ఎస్పీలు రవి మనోహరాచారి, వెంకట్రావుల ఆధ్వర్యంలో చంద్రగిరి డీఎస్పి బి.ప్రసాద్, చంద్రగిరి సుబ్బరామిరెడ్డి నేతతంలో చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహించి నారావారిపల్లి గ్రామానికి ప్రజలను అనుమతించారు.

తమ్ముడు నారా రామ్మూర్తి నాయుడు అంతిమసంస్కారాల కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం ఉదయం 10 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరకున్నారు. అక్కడి నుంచి వాహనాల్లో 11 గంటలకు నారావారిపల్లికి చేరుకున్నారు. నారావారిపల్లెకు సీఎం చంద్రబాబుతోపాటు భార్య నారా భువనేశ్వరి, కోడలు నారా బ్రాహ్మణి,, మనవడు నారా దేవాన్ష్ చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఎస్పి సుబ్బరాయుడు, ఎమ్మెల్యే పులివర్తినాని రామ్మూర్తి నాయుడు పార్థివ దేహానికి తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పుష్పాంజలి ఘటించారు. అనంతరం రామ్మూర్తి నాయుడు అంతిమయాత్రలో అన్న చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, ఎమ్మెల్యే పులివర్తి నాని, నారా, నందమూరి కుటుంబ సభ్యులు పాడెను మోసారు. చంద్రబాబు మాట్లాడుతూ తన తమ్ముడు రాజకీయంగా తనకు అండగా నిలిచిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని, తెలుగుదేశం పార్టీ అభివద్ధికి కష్టపడిన తీరు, అజాతశత్రువుగా కల్మషం లేకుండా అందరితో కలిసిమెలిసి నడిచారని గుర్తుచేసుకుంటూ చంద్రబాబు కన్నీళ్లు పెట్టుకున్నారు.

రామ్మూర్తి నాయుడికి శ్రద్ధాంజలి...

సీఎం చంద్రబాబుకు గవర్నర్, ప్రముఖులు సంతాపం..

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తమ్ముడి మరణవార్త తెలుసుకున్న మహారాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్ ఆదివారం నారావారిపల్లెకు చేరుకుని రామ్మూర్తి నాయుడు పార్ధవ దేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. చంద్రబాబుకి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. గవర్నర్‌తోపాటు చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, చంద్రగిరి, సత్యవేడు, పలమనేరు, చిత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, పూతలపట్టు, నగరి, ఎమ్మెల్యేలు పులివర్తినాని, కె.ఆదిమూలం, ఎన్.అమరనాథరెడ్డి, గురజాల జగన్‌మోహన్, బొజ్జల సుధీర్ రెడ్డి, కె.రామకృష్ణ, కె.మురళీ మోహన్, గాలి భానుప్రకాష్, మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ ఎం.మోహన్ బాబు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు, టిటిడి అదనపు ఈవో వెంకయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, మోహన్, ఎస్‌సివి నాయుడు, శ్రీనినాథ్ రెడ్డి, ఎఎస్.మనోహర్, చదలవాడ కృష్ణమూర్తితోపాటు సినీ ప్రముఖులు రాజేంద్రప్రసాద్, మంచు మనోజ్, నాగసౌర్య టిటిడి పాలక మండలి సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ టిడిపి, బిజెపి, జనసేన పార్టీల జిల్లా నాయకులు పూలమాలవేసి నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆత్మబంధం.. అంతిమ యాత్ర..

తన తమ్ముడు నారా రామ్మూర్తి నాయుడు తనకు దూరమయ్యాడని బాధతో సీఎం చంద్రబాబు నాయుడు శోకసంద్రంలో మునిగిపోయారు. సాయంత్రం నాలుగు గంటలకు అంతిమ సంస్కారాలు ప్రారంభమయ్యాయి. చంద్రబాబు అమ్మ అమ్మన్నమ్మ, నాన్న ఖర్జూరపు నాయుడు సమాధుల వద్ద దహన సంస్కారాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. రామ్మూర్తి నాయుడు పాడెను స్వయంగా చంద్రబాబు, నారా లోకేష్ వారి భుజాలపై మోసారు.

అంత్యక్రియల్లో..

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు..

రామ్మూర్తి నాయుడు అంత్రక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో పోలీసులు గార్డ్ ఆఫ్ హానర్ నిర్వహించి గాలులోకి కాల్పులు జరిపి వందన సమర్పణ చేశారు. సాంప్రదాయపద్ధతిలో అంత్యక్రియలు జరిపారు. రామ్మూర్తి చిన్నకొడుకు సినీనటుడు నారా రోహిత్ తండ్రికి తల కొరివిపెట్టి అంత్యక్రియలు ముగించారు. కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు, ప్రముఖులు కన్నీటి వీడ్కోలు పలికారు.

తిరుగు ప్రయాణమైన సీఎం కుటుంబం..

నారావారిపల్లెలో నారా రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలు ముగిసిన అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, నారా బ్రాహ్మణి,, నారా భువనేశ్వరిలు ఆదివారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

నివాళి అర్పిస్తున్న గవర్నర్ రాధాకృష్ణన్, ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, టిటిడి మాజీ అధ్యక్షులు చదలవాడ కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు, డప్పు కొట్టిన మందకృష్ణ మాదిగ, గౌరవ వందనం సమర్పించిన పోలీసులు

నేడు సెయింట్ కనకదాస జయంతి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 18న సెయింట్ కనకదాస జయంతి వేడుకలను జిల్లాలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న ఉదయం 9 గంటలకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సచివాలయంలోని పాత గ్రీవిన్స్ హాల్‌లో సెయింట్ కనకదాస జయంతి అధికారిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

చైన్ స్నాచింగ్ దొంగలు అరెస్టు

- 332 గ్రాముల బంగారం, మూడు బైకులు స్వాధీనం

ముద్దాయిలను చూపుతున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: బెంగళూరులో మోటార్ సైకిళ్లను దొంగిలించి, వాటిని ఉపయోగించి చిత్తూరు, అన్నమయ్య జిల్లాలలో చైన్ స్నాచింగ్ నేరాలకు పాల్పడుతున్న నేరస్తులను పోలీసులు అరెస్టు చేశారు. గత కొద్ది రోజులుగా చిత్తూరు జిల్లాలోని చౌడేపల్లి, గంగవరం, ముదివేడు, రామసముద్రం, పలమనేరు, రాళ్లబుదుగురు, బైరెడ్డిపల్లి మండలాలలో ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసి చైన్ స్నాచింగ్, మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్తులను చౌడేపల్లి పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు.

చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు, చైన్ స్నాచింగ్ నేరస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టేందుకు ప్రత్యేక నిఘా ఉంచారు. పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ పర్యవేక్షణలో చౌడేపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్‌రామ్ భూపాల్‌తో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. అదివారం ఉదయం అందిన సమాచారం ఆధారంగా ప్రత్యేక నిఘా బృందం ముద్దాయిలను బోయకొండ వద్ద అన్నమయ్య జిల్లాకు చెందిన చంద్రశేఖర్, రాసురి హరికృష్ణలను అరెస్ట్ చేసి వీరు ఇచ్చిన సమాచారం మేరకు మేరకు మిగిలిన నాగరాజు, లక్ష్మి, పవన్ కుమార్, భాస్కర్, భావాజాన్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని పలు చోట్లలో చైన్ స్నాచింగ్ దొంగతనాలు చేశారు. నిందితుల వద్ద నుండి చౌడేపల్లి 4, గంగవరం 1, ముదివేడు 1, రామసముద్రం 2, పలమనేరు 1, రాళ్ళబుదుగురు 1, బైరెడ్డిపల్లి 1 చైన్ స్నాచింగ్ సంఘటనలకు సంబంధించిన 332 గ్రాముల బంగారు ఆభరణాలు, దొంగతనానికి ఉపయోగించిన మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ. 25,74,000 ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. గత రెండు సంవత్సరాలుగా బెంగళూరులో మోటార్ సైకిళ్లను దొంగిలించి, వాటిని ఉపయోగించి చిత్తూరు, అన్నమయ్య జిల్లాలలో చైన్ స్నాచింగ్ నేరాలకు పాల్పడుతున్నారు. చంద్రశేఖర్, రాసురి హరికృష్ణ మోటార్ సైకిళ్ళ దొంగతనాలు చేసి, వాటితో బంగారు ఆభరణాలు దొంగిలించడం చేస్తున్నారు. ఇప్పటివరకు వీరిపై ఏ పోలీస్ స్టేషన్‌లోనూ కేసులు నమోదు కాలేదు. ఎస్పీ మాట్లాడుతూ చైన్ స్నాచింగ్ నేరాలను నిరోధించేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మహిళలు ప్రజాప్రదేశాల్లో సురక్షితంగా ఉండేందుకు పోలీసులు నిరంతరం పనిచేస్తున్నారు. నేరస్తులపై ఉక్కుపాదం మోపడం జరుగుతుందని తెలిపారు. పోలీసుల విజయం ప్రజల సహకారంతోనే సాధ్యమని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

ముద్దాయిల నుండీ స్వాధీనం చేస్తున్న బంగారు ఆభరణాలు

ఆదాయాలపైనే శ్రద్ధ.. సౌకర్యాలపై అశ్రద్ధ..

- బస్టాండ్‌ల నిర్వహణలో ఆర్టీసీ నిర్లక్ష్యం
- అధికారం ఒకచోట.. అవసరాలు మరోచోట..
- పలమనేరు నియోజకవర్గంలో అధ్వానంగా ఆర్టీసీ బస్టాండ్‌లు

అధ్వానంగా ఉన్న వికో బస్టాండ్

ప్రజాశక్తి- వి కోట: ఆదాయం ఉన్నా.. అధికారుల అనాలోచిత నిర్ణయాలతో పలమనేరు నియోజకవర్గంలోని బస్టాండ్‌ల నిర్వహణలో అలసత్వం వల్ల ప్రజలు అవస్థలు పడుతున్నారు. దశాబ్దాల కాలంగా నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యానికి రోడ్లనే బస్టాండ్లుగా మార్చుకొని ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులకు ఆదాయాలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేకపోవడం ప్రయాణికులకు శాపంగా మారుతోంది. నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి, గంగవరం,పెద్దపంజాణి మండలాల్లో బస్టాండ్లు లేక రోడ్లనే బస్‌స్టాప్‌లుగా మార్చుకొని ప్రజలు ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. కనీసం గుర్తింపు పొందిన బస్‌స్టాప్‌లలో వానలు, ఎండలు నుండి ప్రయాణికులను రక్షించేందుకు బస్ షెల్టర్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదాయం ఉన్నా అభివృద్ధి శూన్యం..

వీ కోట మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు అనుసంధానంగా ఉన్న దుకాణ సముదాయాల ద్వారా లక్షల రూపాయలు ఆదాయాన్ని ప్రతినెలా ఆర్టీసీకి అందుతోంది. దశాబ్దాల కాలంగా గుంతలు పడిన, గులక తేలిన బస్టాండ్‌కు అధికారులు శాశ్వతంగా సిమెంట్ ప్లాట్ ఫామ్ వేయలేకపోతున్నారు. బస్టాండ్ ప్రారంభం అయినా తొలినాళ్లలో బస్టాండ్‌కు ఇరువైపులా పలమనేరు రోడ్డు నుండి పర్నంబట్ రోడ్డు వైపు నుండి ప్రధాన రహదారులు కలుపుతూ ఉన్న రహదారులలో ఒకదాన్ని శాశ్వతంగా మూసివేసి ఆదాయమే లక్ష్యంగా దుకాణాలకు కేటాయించారు. దీనితో బస్టాండ్ ప్రాంగణం కుచించుకుపోయి పెరిగిన బస్సుల సంఖ్య ప్రయాణికుల రద్దీల నేపథ్యంలో బస్సుల రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైంది. బస్టాండ్‌కు ప్రయాణికుల రాకపోకలకు కేటాయించిన నడక స్థలాన్ని కూడా దుకాణాలకి కేటాయించడంతో నూతనంగా వచ్చే ప్రయాణికులు బస్టాండ్ ఎక్కడో తెలియక అయోమయానికి గురవుతున్నారు.

కరువైన సౌకర్యాలు.. అవస్థలు పడుతున్న ప్రయాణికులు..

అంతర్‌రాష్ట్ర కూడలి అయిన వీకోట మండలం నిత్యం ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడుతూ ఉంటుంది. వందలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులకు సేవలందించే బస్టాండ్‌లో కనీస సౌకర్యాలైన తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ కరువై మహిళలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు వెలగక చీకటి కార్యకలాపాలకు నిలయంగా మారుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారం ఒకచోట.. అవసరాలు మరోచోట..

పలమనేరు నియోజకవర్గంలో భాగమైన వీకోట మండలంలోని ఆర్టీసీ బస్టాండ్ నిర్వహణ కుప్పం ఆర్టీసీ డిపో పరిధిలో కొనసాగుతోంది. ప్రతినెలా దుకాణ సముదాయాలు, కార్గో సేవలు వల్ల లక్షల రూపాయలు ఆదాయం వస్తున్న ఈ బస్టాండ్ నిర్వహణను అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రతిరోజు కుప్పం, పలమనేరు డిపోల బస్సులేకాక కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన బస్సులు హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు తదితర సుదూర ప్రాంతాలకు పదుల సంఖ్యలో ఈ బస్టాండ్ మీదుగా సేవలందిస్తుంటాయి. గతంలో బస్టాండ్ నిర్వహణలో కంట్రోలర్‌ను నియమించి కార్యకలాపాలు కొనసాగించేవారు ప్రస్తుతం ఎవరూ లేక ప్రయాణికులకు సమాచారం అందించేవారు కరువయ్యారు. దినదినాభివృద్ధి చెందుతున్న వీకోట మండల కేంద్రం నుండి మారుమూల ప్రాంతాలకు గతంలో ఆర్టీసీ తన సేవలను కొనసాగించేది. వివిధ కారణాలతో అధికారులు ఆ సర్వీసులను రద్దు చేయడంతో విద్యార్థులు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం కుప్పం నియోజకవర్గంకు చెందిన పిఎస్ మునిరత్నం రాష్ట్ర ఆర్టీసీ డిప్యూటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినందున కుప్పం డిపోలో భాగమైన వీకోట ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు పలమనేరు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండల కేంద్రాల్లో బస్ స్టాప్‌ల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సులు బస్టాండ్ లోపలకి రావు..

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండల కేంద్రంలో ప్రధాన జాతీయ రహదారికి పక్కనే ఆర్టీసీ అధికారులు 25 సంవత్సరాల మునుపు ప్రయాణికుల సౌకర్యం కోసం ఆర్టీసీ బస్టాండ్ నిర్మించారు. బస్టాండ్ నిర్మించిన కొత్తలో బస్టాండ్ ఆవరణంలోకి ఇటు మదనపల్లి, చిత్తూరు నుంచి వచ్చే బస్సులు బస్టాండ్ ఆవరణంలోకి కొన్ని రోజులు వచ్చాయని స్థానికులు తెలిపారు. అప్పటినుంచి జాతీయ రహదారిపైనే బస్సులు ఆపి ప్రయాణికులను తీసుకెళ్తున్నారని దీంతో జాతీయ రహదారిలో అటువైపు నుంచి ఇటువైపు నుంచి బస్సులు ఆపడం వల్ల రోడ్డు దాటే పాదచారులకు, ద్విచక్ర వాహనదారులకు తీవ్రఇబ్బందులు ఎదురై ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఆర్టీసీ బస్సులు బస్టాండ్ ఆవరణంలోకి రాకుండా జాతీయ రహదారిపైనే ప్రయాణికులను తీసుకెళుతున్న ఫలితంగా బస్టాండు నిరుపయోగంగా తయారై ప్రైవేటు వాహనాలకు పార్కింగ్‌గా మారింది. దీంతో ఆకతాయిలు బస్టాండులో అమర్చిన అద్దాలు పగులగొట్టి అధ్వానంగా మార్చేశారు. కొన్నాళ్ల క్రితం ఆర్టీసీ అధికారులు బస్టాండును పరిశీలించి మరమ్మతులు చేయించి, బస్టాండు లోపలికి బస్సులు వచ్చేలా చర్యలు తీసుకున్నా.. తర్వాత పరిస్థితి యథావిధిగా మారింది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు బస్టాండ్ అనుబంధం ఉన్న ఖాళీ స్థలాలు అద్దెలకు ఇస్తున్నారు కానీ.. ఆర్టీసీ బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేందుకు చొరవ తీసుకోలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మదనపల్లి నుంచి చిత్తూరు వైపు, పలమనేరు నుంచి మదనపల్లి వైపు వెళ్లే బస్సులను బస్టాండుకు వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నాలుగు రోడ్ల కూడలిలో బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

నాలుగు రోడ్ల కూడలే బస్టాండ్

- వ్యవసాయ కార్మికుల మండల అధ్యక్షుడు పాకాల సుబ్రహ్మణ్యం

పలమనేరు నియోజకవర్గ పరిధిలోని గంగవరం మండల కేంద్రంలో నాలుగు రోడ్లు కూడలే బస్టాండ్‌గా కొనసాగుతోంది. బస్సు షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వర్షానికి తడుచుకుంటూ బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఈ ప్రాంతం చెన్నై – బెంగళూరు రహదారి కావడంతో చుట్టుపక్కల గ్రామాల వారు బెంగళూరుకు, చెన్నై, తిరుపతి వైపువెళ్లే ప్రయాణికులు రోజుకు వందల సంఖ్యలో ఉంటారు. వర్షాలు పడుతున్నా చంటి పిల్లలను ఎత్తుకొని వానలో తడుచుకుంటూ నిలబడే పరిస్థితి. గతంలో దివంగత రామకృష్ణారెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు అనేక చోట్ల బస్సు సెంటర్లు కట్టారు. అయితే అవి పూర్తిగా పాడైపోవడంతో ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదు. మండల కేంద్రం గంగవరంలో గతంలో ఉన్న బస్సు సెంటర్లను కూల్చి స్థానికులు ఇల్లు నిర్మించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు.

మౌలిక వసతులు.. విద్యాప్రమాణాల పెంపు..

సమగ్రశిక్షా అభియాన్ లక్ష్యం

ఇంటర్వ్యూ

పీడీ వెంకటరమణారెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్



ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పన, విద్యాప్రమాణాల పెంపు కోసం సమగ్రశిక్షా అభియాన్ కృషి చేస్తోంది. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణం, మౌలిక వసతులైన తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీగోడల నిర్మాణం, వంటగదులు, అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టి విద్యార్థుల పురోగతికి తోడ్పడుతూ విద్యాప్రమాణాల పెంపుకు కృషి చేయడం జరుగుతోంది. ప్రభుత్వం మంజూరు చేసే నిధులను సమగ్రశిక్ష అభియాన్ ద్వారా పాఠశాలలను ఆదునీకరణ కోసం ఖర్చు చేయడం జరుగుతుందని సమగ్రశిక్ష అభియన్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట రమణారెడ్డి తెలిపారు.

ప్రజాశక్తి: నాడు– నేడు అసంపూర్ణ పనులు ఎప్పటికి పూర్తి చేస్తారు..?

పీడీ: నాడు– నేడు కింద జిల్లాలో రెండు విడతలో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పాఠశాలలను ఆధునీకరించడం జరిగింది. జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, ఇతర నిర్మాణాలు అసంపూర్ణంగా ఉన్నాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే పూర్తి చేయడం జరుగుతుంది.

ప్రజాశక్తి: అసంపూర్ణ నిర్మాణాల వద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు....?

పీడీ: అసంపూర్తిగా నిర్మాణాలు ఉన్న ప్రాఠశాల వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈఓల ద్వారా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అసంపూర్ణ నిర్మాణాల వద్దకు విద్యార్థులు వెళ్ళకుండా రెడ్ రిబ్బన్ కట్టడం, రేకులు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. నిర్మాణ గుంతలు ఉంటే పూడ్చివేశాం.

ప్రజాశక్తి: సమగ్ర శిక్ష ద్వారా పాఠశాల అభివృద్ధి కోసం ఏఏ పనులు చేయవచ్చు..?

పీడీ: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులైన నీటి సరఫరా, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు ఏర్పాటు, శుద్ధినీటి వసతి, పాఠశాల గదులకు రంగులు, గ్రీన్‌గ్లోస్స్ చాక్ బోర్డు ఏర్పాటు, ఇంగ్లీష్ ల్యాబ్, ప్రహరీగోడల నిర్మాణం, వంట గదుల నిర్మాణం, అదనపు తరగతి గదుల నిర్మాణం, అంగన్వాడీ భవనాల మరమ్మతులు, ఆట వస్తువుల కొనుగోలు వంటివి.

ప్రజాశక్తి: విద్యా ప్రమాణాల పెంపుకు ఎలాంటి కృషి చేస్తున్నారు.?

పీడీ: జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా విద్యాప్రమాణాల పెంపుకు కృషి చేయడం జరుగుతోంది. విద్యార్థుల సామర్థ్యాని బట్టి విద్యాను అందిచేలా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం, ల్యాబ్స్ ఏర్పాటు చేయడం, సైన్సు ఎగ్జిబిషన్స్ నిర్వహణ వంటి చేపడుతున్నాం.

ప్రజాశక్తి: ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు ఎలా ఉన్నాయి..?

పీడీ: ఉమ్మడి జిల్లాలో ప్రాథమి, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 4,828 ఉన్నాయి. వీటిల్లో 3,64,446 మంది విద్యార్థులు విద్యనభ్యస్తున్నారు. వీరికి ప్రభుత్వం ద్వారా ఈ విద్య సంవత్సరంలో అందించాల్సిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం మూడు జతలు అందించడం జరిగింది.

ప్రజాశక్తి: మోడల్ పాఠశాలలు ఎలా నడుస్తున్నాయి..?

పీడీ: ఒక్క చిత్తూరు జిల్లాలో ఏడు ఆదర్శ పాఠశాలో ఆరు నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు చదువుతున్నారు. ఐదు వసతి గృహాల్లో ఒక్కో వసతి గృహంలో వంద మంది బాలికలకు వసతి పొందుతున్నారు.

ప్రజాశక్తి: ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాల గదులు ఎలా ఉన్నాయి..?

పీడీ: దాదాపు జిల్లాలోని అన్ని ప్రాథమి, ప్రాథమికొన్నత, ఉన్నత పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించడం జరిగింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగాయి. మరుగుదొడ్ల నిర్మాణం, ప్రహరీ గోడల నిర్మాణం చేపట్టాం. ఆవరణంలో వివిధ రకాల మొక్కలు నాటడంతో మంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది.

అలరించిన కవి సమ్మేళనం

ప్రజాశక్తి-వి కోట: వికోట శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనం పాటకులను విశేషంగా అలరించింది. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని నాల్గవ రోజు కవి సమ్మేళనం జరిగింది. శ్రీ కళాభారతి ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రఘుపతి వారి అధ్యక్షతన శాఖా గ్రంథాలయంలో జరిగిన ఈ కవి సమ్మేళనంలో జిల్లా నలుమూలల నుంచి కవులు విచ్చేసారు. వారు వినిపించిన కవితాగాణం పాఠకులను విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా వి కోట మండల టిడిపి అధ్యక్షులు ఎయమ్ రంగనాథ్ విచ్చేశారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చాటాలని వారు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కొఠారి వెంకటరత్నం, శాంతకుమారి, టీ శివరామ్, హరికృష్ణ రెడ్డి చిత్తూరు గురుజాడ ఫౌండేషన్ రవీందర్ బాబు, సిద్దారెడ్డి, వివిధ పాఠశాలల విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది మొహ్మద్ వహబ్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సాయి మాత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసినట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్ బాబు తెలిపారు. చిత్తూరు జిల్లా అందత్వ నివారణ శాఖ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 180మంది కంటి సమస్యతో బాధపడుతున్న వారు పాల్గొన్నట్టు తెలిపారు. వీరందరినీ పరీక్షించిన శంకర నేత్రాలయ వైద్యులు అందులో 45మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించినట్టు తెలిపారు. మీరందరికి కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నగరంలోని శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందించడం ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: విశ్రాంతి ఉపాధ్యాయుడు పొన్నేరు దామోదరం ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉండి పలు సూచనలు సలహాలు అందిస్తున్నారని అందరితోను కలవిడిగా నడుచుకుంటూ అందరి దగ్గర గుర్తింపు పొద్దారని వైసీపీలో కూడా ముఖ్య నాయకుడుగా ఎదిగారని గుర్తు చేసుకున్నారు. ఆయనకు పలువురు ప్రజా ప్రతినిధులు సంతాపం తెలియజేశారు.

రామ్మూర్తినాయుడుకి నివాళి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: సీఎం చంద్రబాబు సోదరుడు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు మరణించారు. ఆయన ఫొటోకి ఆదివారం పలువురు టిడిపి నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమం లో మండల టిడిపి అధ్యక్షులు స్వామి దాస్, పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు వెంకటేష్, పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం పాల్గొన్నారు.

వెదురుకుప్పం: నారావారిపల్లెలో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు పార్థివదేహానికి ఆదివారం టిడిపి నేత మోహన్ మురళి నివాళులర్పించారు.

కుప్పం టౌన్: పట్టణ ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో స్థానిక తెలుగు తమ్ముళ్లు నారా రామమూర్తి నాయుడుకు ఘన నివాళి సమర్పించారు. నాయకులు రాజ్ కుమార్, వేలు, మంజునాథ్, వేణు, జయరాం, జనసేన నాయకులు నరేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నడిబూరులో గుంతలమయమైన రోడ్డు

మలుపు వద్ద ఏపుగా పెరిగి ఉన్న ముళ్ళ పొదలు

గుంతల మయం.. గుండెల్లో భయం

జెఎంజె పాఠశాల వద్ద రోడ్డుపై బురదనీరు

జిల్లాలో ప్రధాన రహదారులన్నీ గుంతలమయమై అధ్వానంగా మారాయి. దీంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రయాణం మరింత ఇబ్బందికరంగా మారింది. గంగవరం మండలంలో ప్రధాన మార్గల్లో పరిస్థితి దారుణంగా ఉంది. అనునిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటుండడం గమనార్హం. ఇకనైనా ప్రభుత్వ అధికారులు, పాలకులు పట్టించుకొని రోడ్డు బాగుచేయాలని గ్రామీణులు వేడుకుంటున్నారు.

- ప్రజాశక్తి-గంగవరం

- ప్రమాదకరంగా గ్రామీణ రహదారులు
- రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు
- పట్టించుకోని అధికారులు
- తరచూ ప్రమాదాలతో ఆసుపత్రి పాలవుతున్న జనం

గ్రామీణ ఆర్థిక వ్యవస్థలకు ఆయువుపట్టుగాలాంటి రహదారులు దారుణంగా మారాయి. ప్రధాన రహదారులు రాళ్లు తేలి, గుంతలమయమైపోయాయి. అత్యంత ప్రమాదకర పరిస్థితిల్లో వాహనదారులు ప్రయాణిస్తున్నారు. నరకానికి నకళ్లుగా మారిన పల్లె దారుల్లో ఒళ్లు హూనమవ్వాల్సిందే. గంగవరం మండలంలో ప్రదాన రహదారులన్నీ ఇదే పరిస్థితి. పట్టించుకొనే వారు లేక.. బాగు చేసే పాలకులు చవిచూడక.. రోడ్డు కష్టాలు కొనసాగక తప్పవని గ్రామీణుల్లో నైరాశ్యం నెలకొంది.

ప్రధాన మార్గాలన్నీ గుంతలమయం..

మండలంలోని ప్రధాన మార్గాలన్నీ గుంతలమయమైపోయాయి. పలమనేరు నుంచి శంకరాయపేట, పలమనేరు నుంచి గుండిగళ్లుకు వెళ్లే రహదారులు పెద్దపంజాణి, గంగవరం మండలాలకు అనుసంధానమై వెళుతూ ఉంటాయి. పలమనేరు నుంచి శంకరాయపేటకు వెళ్లే దారిలో సుమారు 20 గ్రామాలకు పైగా ఉన్నాయి. పలమనేరు నుంచి గుండిగళ్లుకు వెళ్లే రహదారిలో 20 గ్రామాలు ఉన్నాయి. అయితే ఇవి మరమ్మతులకు నోచుకోక పూర్తిగా గుంతలు ఏర్పడి పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. ద్విచక్ర వాహన చోదకులు అదుపుతప్పి ప్రమాదాల పాలవుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు మరీ ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు సాయంత్రం ఐదు నుంచి 8గంటల వరకు ఈ రహదారులన్నీ కళాశాల బస్సులు, పాల డైరీ వ్యానులు, ఆటోలతో అతి రద్దీగా ఉంటాయి. వర్షాలు పడిన సమయంలో శంకరాయపేటలో పాఠశాల విద్యార్థులు గుంతల్లో పడిపోయి, పుస్తకాలు బురదమయం అవ్వడంతో పాటు గాయాలపాలైయ్యారు. ఈ రహదారి గుండా ప్రయాణిస్తున్న దిచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతుండడం పరిపాటిగా మారింది.

అల్లుకున్న ముళ్ళ పొదలు

ప్రధాన రహదారి విస్తరణకు నోచుకోక పోవడమే కాకుండా ఉన్న సింగిల్ రోడ్డులో ముళ్ళ పొదలు రోడ్డుకు ఇరువైపులా అల్లుకుపోయాయి. ప్రధానంగా రోడ్డు మలుపుల వద్ద అటువైపున ఏ వాహనం వస్తోందో తెలియక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని చోట్ల వారుస ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రాంతంలో ద్విచక్ర వాహనదారులు అనేకసార్లు అదుపుతప్పి ఆసుపత్రుల పాలు అయిన సందర్భాలు ఉన్నాయి. రైతులు కూరగాయలను మార్కెట్‌కు తరలించే క్రమంలో, దాన్యాలు సరఫరా చేసే వాహనాలు అనేకసార్లు బోల్తా పడిన సందర్భాలు అనేకం. ఈ ఏడాదిలో కనీసం 10రోడ్డు ప్రమాదాలు జరిగి ఆసుపత్రి పాలైన బాధితులు చాలామంది ఉన్నారు.

పాలకులు పట్టించుకోవాలని వేడుకోలు..

గుంతలమయమైన రోడ్లు, రోడ్డుకు ఇరువైపులా ముళ్ళపొదలు అల్లుకొని ఉండడంతో రహదారులను పాలకులు పట్టించుకొని బాగు చేయాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు. గుంతల మయమైన రోడ్లును మరమ్మతులు చేయించాలని కోరుకుంటున్నారు. రహదారి పొడవునా ఇబ్బంది పడుతున్నామని, వెంటనే అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రజలు మొరపెట్టుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలైయ్యాయి..

శంకరాయపేట నడివీధిలో ద్విచక్ర వాహనంలో వస్తుంటే బంకమట్టి తోలడం వల్ల బైక్ అదుపు తప్పింది. నా భార్య చెయ్యి విరిగిపోయింది. ఆసుపత్రిలో లక్ష ఖర్చు చేయాల్సి వచ్చింది. అదే విధంగా మా పిల్లలు పాఠశాలకు వెళ్లాలంటేనే ఇబ్బంది పడుతున్నారు. రోడ్డంతా బురదగా ఉంటోంది. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలి.

- వాహనదారుడు లోకేష్

కంచిరెడ్లపల్లి వద్ద త్రుటిలో ప్రమాదం తప్పింది

కంచిరెడ్లపల్లి సమీపాన మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనం కనపడకపో వడంతో వాహన అదుపుతప్పి ముల్లపదలకి వెళ్లే పోయాం. త్రుటిలో ప్రమాదం తప్పింది. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా.. నాయకులు, అధికారులు తెలిసి తెలియనట్లు వెళుతుండడం ఏంటో అర్థం కాలేదు. ఇకనైనా అధికారులు స్పందించి గుంతలు పూడ్చి రోడ్డుకు మరమ్మతులు చేయించాలి.

- వాహన దారుడు, జగదీష్

క్రైం కార్నర్

సారా ఊట ధ్వంసం

ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-గుడిపాల: మండలంలోని రాసనపల్లి అటవీ ప్రాంతంలో ఆదివారం ఉదయం చేపట్టిన దాడుల్లో 1500 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. అక్రమ నాటు సారా, కర్ణాటక మద్యం, గంజాయి తదితర అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు దాడులు నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా రాసన పల్లి అటవీ ప్రాంతంలో తన సిబ్బందితో కలిసి దాడులు చేసినట్లు ఆయన వివరించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులకు చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

టెంపో ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: టెంపో ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని నలగంపల్లి వద్ద చోటు చేసుకుంది. ఏఎస్ఐ మల్లప్ప నాయుడు ఇచ్చిన సమాచారం మేరకు నలగాంపల్లి గ్రామానికి చెందిన ఆబెల్ (77)తన పాడి ఆవులను రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో మేపుకొని తిరుగు స్వగ్రామానికి దాటి వస్తుండగా చిత్తూరు నుంచి పలమనేరు వైపు వెళ్లే టెంపో వ్యాను ఢీకొంది. ఈ సంఘటనలో అతనికి తీవ్ర గాయాలు కాగా బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు. శవ పంచనామ కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కార్తీక వనభోజనాలు

ప్రజాశక్తి-ఐరాల: కాణిపాక ఆలయంలో సేవలందిస్తున్న బ్రాహ్మణ కుటుంబాలు ఆదివారం వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా విశేష పూజలు నిర్వహించుకుని ధాత్రి పూజ చేపట్టారు. అనంతరం నైవేద్యాలు నిర్వహించుకుని వనభోజన కార్యక్రమాలు చేపట్టారు.

'వృద్ధాప్యంలో తీసుకున్న సభ్యత్వం వృథా పోదు'

ప్రజాశక్తి-కుప్పం రూరల్: వృద్ధాప్యంలో తీసుకున్న సభ్యత్వం వృథా పోదు అంటూ 98సంవత్సరాల వయసు గల కనుకమ్మ తెలిపారు. టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆమె ఆదివారం సభ్యత్వ నమోదు చేసుకున్నారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి ఆధ్వర్యంలో కుప్పం మండలం చెక్కునత్తం పంచాయితీ కూసూరు గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగింది.

అభివృద్ధికి సమిష్టి కృషితో పనిచేయాలి: ఎంపీపీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండల అభివృద్ధికి సమిష్టి కృషితో పనిచేయాలని ఎంపీపీ అమరావతి అన్నారు. ఆదివారం మండల కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గత సమావేశంలో చర్చించిన అంశాలు వాటి పురోగతిపై వ్యత్యాసాలను గమనించాలని ఎంపీపీ సూచించారు. సమావేశం లో శాఖా పరమైన నివేదికలను సభలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, జెడ్పిటిసి సోమశేఖర్, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, కో ఆప్షన్ నెంబర్ ఫిరోజ్ అహ్మద్, సర్పంచులు కోక ప్రకాష్ నాయుడు, శ్రీహరి, ధనంజయ, వాణి ప్రియ, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురంలో..

ఎస్ఆర్ పురం: ముందుగా అనుకున్న విధంగా మండలమీట్‌కి ఎంపీపీ సరిత, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి హాజరుకాలేదు. అనారోగ్య కారణాలతో సభకు రాలేదని తెలుసుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు సభను వాయిదా వేసి వెనుదిరిగారు. ప్రజాసమస్యలపై చర్చకు అవకాశం లేకుండా పోయింది.

ఆ జ్ఞాపకాలన్నీ మధురాతి మధురం

- 38ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక
- గుర్తుకొచ్చిన ఆనాటి జ్ఞాపకాలు
- ఆటపాటలతో సందడి

38ఏళ్ల తరువాత ఒక్కటైన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: వారంతా ఒకే కళాశాలలో చదువుకున్నారు. చదువు పూర్తవ్వగానే ఎవరికి వారే ఉపాధ్యాయులుగా వెళ్లి పోయారు. ఎవరు ఏ పాఠశాలలో పనిచేస్తున్నారో, ఎవరు ఎక్కడ స్థిరపడ్డారో ఎవరికి తెలియదు. ఎక్కడో ఒకరో ఇద్దరో అప్పుడప్పుడు కలుసుకుని మాట్లాడుకు నేవారు తప్ప పెద్దగా పరిచయాలు లేని వారుగా మారిపోయారు. ఇంతలో ఒక ఫోన్ కాల్ తమ టీటీసీ కళాశాల జ్ఞాపకాలను గుర్తు తెచ్చింది. ఓరేయ్ నేనురా నీ టీటీసీ స్నేహితుడు గాజుల నాగేశ్వరరావును. మనం కలిసి చదువుకున్న డైట్ కళాశాలలో అప్పటి స్నేహితులతో మళ్లీ కలుసుకోవడానికి ఏర్పాటు చేస్తున్నాం. నువ్వు తప్పకుండా రావాలి అన్న మాట విని ఇటు నరసింహులు(చీఫ్ ఎస్బీఐ మేనేజర్) ఒక్కసారిగా 16ఎళ్ల పిల్లాడిలా మారిపోయాడు. అరే నాగేశ్వరరావు నువ్వా.. ఎన్నాళ్లు అయిందిరా నీతో మాట్లాడి.. మళ్లీ మాట్లాడుతానని గానీ, కలుస్తామని గాని ఊహించ లేదు. ఈ ఫోన్ కాల్‌తో నాకు ఎక్కడ లేని ఆనందం వచ్చిందిరా.. తప్పకుండా అందరం కలుసుకుందాం అంటూ వారి మధ్య సాగిన సంబాషణ అనంతపురం, నెల్లూరు, కడప, చిత్తూరు, కర్నూలు జిల్లాలో ఎక్కడెక్కడో ఉన్న వారందరినీ ఒకటిగా చేసింది. 38ఏళ్ల తరువాత మళ్లీ డైట్లో విద్యార్థులుగా మారిపోయారు. ఆంధ్రరాష్ట్రంలోనే డైట్ కళాశాలలకు ఆదర్శంగా నిలుస్తున్న కార్వేటినగరం డైట్ కళాశాలలో 1985-86 విద్యా సంవత్సరంలో టీటీసీ చదువుకున్న విద్యార్థులు ఆదివారం డైట్ కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పట్లో 100మంది విద్యార్థులు కలసి ఒక్క సంవత్సరం పాటు టీటీసీ చదువుకున్నారు. వీరిని ఇన్నేళ్ల తరువాత ఒకటి చేయాలని ఉద్దేశంతో కార్వేటినగరానికి చెందిన అప్పటి టీటీసీ ఛాత్రోపాధ్యాయులు గాజుల నాగేశ్వంరావు శేఖర్, ఆనంద్ మురుగన్ స్నేహితుల వివరాలని సేకరించి వారిని ఒకటి చేసే ప్రయత్నంలో విజయం సాధించారు. చివరకు 80మందిని కలుసుకునేలా చేయగలి గారు. 38సంవత్సరాల తరువాత డైట్ కళాశా లలో కలుసుకోవడంతో వీకి ఆనందానికి అవ ధుల్లేవు. ఆనాటి మధుర క్షణాలను మళ్లీ గుర్తు చేసుకున్నారు. చదువుకున్న కళశాలలో చదువులు చెప్పిన గురువుల ఒడిలో ఒదిగి పోయారు. ఆటల పాటలతో సందడి చేశారు. చివరిగా గురువులను సత్కరించి వారి ఆశీస్సులు పొందారు. అలాగే విద్యాబోధనలు అందించి మృతి చెందిన గురువుల చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే పూర్వ విద్యార్థులు కళాశాల ఆవరణంలో స్టేజీ నిర్మాణానికి రూ.1.75లక్షల మెగా చెకున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్‌ను అందించారు.

జ్ఞాపకాలు పంచుకున్నాం

ఎప్పుడూ కొట్టుకుంటూ.. తిట్టికుంటూ.. ఒకరిపై ఒకరు చాడీలు చెప్పుకుంటూ గడిపిన కళాశాల జ్ఞాపకాన్ని మళ్లీ గుర్తుకు తెచ్చుకున్నాం. మా జీవన పోరాటం, కుటుంబ విషయాలను ఒకరికొకరు చెప్పుకున్నాం.



అందరం ఎవరి దారిన వారు వృత్తి రీత్య విడిపోయి వెళ్లాక మాకు జరిగిన సంఘటనలను చెప్పుకుని ఆనందాన్ని పంచుకుంటుంటే ఎంతో చెప్పలేని అనుభూతికి లోనయ్యాం.

- బి.నరసింహులు, ఎస్.బీ.ఐ చీఫ్ మేనేజర్, మదనపల్లి

ఇదో కొత్త అనుభూతి

ఇది మా జీవితాల్లో కొత్త అనుభూ తి, అనుబంధంగా మిగిలిపోతుంది. ఎప్పుడో 38ఏళ్ల క్రితం డైట్ కళాశాలలో టీటీసీ శిక్షణ పొంది ఎవరిదారిన వారు వెళ్లిపోయిన మేము ఇలా ఇన్నేళ్ల తరువాత ఒక్కటవ్వడం చాలా సంతోషంగా ఉంది. వయస్సు మీదపడుతోంది. మనవళ్లు, మనవరాళ్లు ఆడుకునే సమయంలో మళ్లీ మేము కలుసుని చిన్న పిల్లలుగా మారిపోయాం. ఈ ఆనందం కొన్ని కోట్లు ఖర్చుపెట్టినా కొనలేం.

- గాజుల నాగేశ్వరరావు, ఉపాధ్యావాణి సంపాదకులు, కార్వేటినగరం

వారపు సంత.. సమస్యల చింత

- నిర్వహణ లోపం.. సౌకర్యాలూ శూన్యం
- లక్షల్లో వేలం పాట.. ఖర్చు చేస్తున్నది సున్నా..
- సంతలపై నానాటికీ తగ్గుతున్న ఆదరణ
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఇబ్బంది పడుతున్న రైతన్నలు

మండలంలో వారపు సంతలు జరిగే ప్రాంతాలివీ..

దేవళంపేట, మొరవ, వెదురుకుప్పం, పాతగుంట, చవటగుంట, పచ్చికాపల్లం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: నాటి నుంచి పల్లె సీమల్లోని పేదవర్గాలకు తెలిసిన సూపర్ మార్కెట్ ఒకటే.. అదే వారపు సంత. వారం పొడవునా కష్టపడి సంపాదించిన సొమ్ముతో వారపు సంతలో కూరగాయలు, సరుకులు వంటివి కొనుగోలు చేసి వారం పొడవునా వినియోగంచుకొనే వారు. అయితే రైతులు పండించిన పంటలను విక్రయించి సొమ్ము చేసుకోవాడానికి అదే సంతలు ఉపయోగపడేవి. ప్రస్తుతం ఆ సంతలు ఆదరణకు నోచుకోక.. సౌకర్యాలు లేక రైతులు, పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కనీస వసతులు లేక దయనీయమైన పరిస్థితి నెలకొంది.

సౌకర్యాలు లేక..

వారపు సంతల్లో కనీస సౌకర్యాలు కరువైయ్యాయి. కూర్చోవడానికి దిమ్మెలు లేక.. వర్షమొస్తే కాస్తంత చాటు లేక రైతులు, వ్యాపరస్తులు ఇబ్బందులు పడుతున్నారు. కనీస మరుగుదొడ్లు కూడా లేవు. సంతలో నీటి సౌకర్యం లేకపోగా పారిశుధ్య నిర్వహణ కూడా పట్టించుకొనే నాదుడే కరువైయ్యాడు. కొన్ని చోట్ల సంత నిర్వహణకు స్థలం ఉన్నా.. సౌకర్యాలు లేవు.. ఇంకొన్ని చోట్ల రోడ్లపైనే సంత నిర్వహిస్తున్న పరిస్థితి. అసౌకర్యాలతో నిర్వహిస్తున్న సంతకు వ్యాపారస్తులు పెద్దగా రాకపోవడంతో రోజురోజుకీ ఆదరణ తగ్గిపోతోంది. వారాంతపు సంతకు వినియోగదారులు రాకపోవడంతో కూరగాయలు విక్రయించుకొనే రైతులు ఇబ్బంది పడుతున్నారు. సంతల్లో తత్కాలిక దుకాణాలు లేకపోవడంతో పేద ప్రజలూ ఇబ్బంది పడుతున్నారు.

లక్షల్లో వేలం.. ఖర్చు శూన్యం..

ఏటా పంచాయతీ పాలకులు వారపు సంతల వేలం పాట నిర్వహిస్తారు. లక్షల్లో పంచాయతీకి సొమ్ము చేసుకుంటారు. సంతకు వచ్చిన వ్యాపారస్తులు, రైతుల నుంచి వారం వారం వేలం పాట దారులు రుసూం వసూళ్లు చేసుకుంటారు. అయితే వేలం పాటలో వచ్చిన ఆదాయాన్ని సంతల్లో సౌకర్యాలు కల్పించేందుకు పాలకులు, అధికారులు ఖర్చు చేయడానికి చొరవ తీసుకోవడం లేదు. కనీసం పారిశుధ్య పనులు, నీటి సౌకర్యం కల్పించడంలోనూ మొండిచేయి చూపిస్తున్నారు. దీంతో రైతులు, వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారు. కనీస సౌకర్యాలు కల్పించాలని మొరపెట్టుకుంటున్నారు.

గతంలో అన్నీ వారపు సంతల్లో దొరికేవి..

- వాసుదేవయ్య, పచ్చికాపల్లం

మా చిన్ననాటి నుంచి అన్నీ వస్తువులు, కూరగాయలు వారపు సంతోల్లోనే కొనుగోలు చేసేవాళ్లం. వ్యాపారస్తులు దుస్తులు కూడా సంతల్లోనే విక్రయించేవాళ్లు. సంత దినం అంటే ఒక పండుగలా ఫీల్ అయ్యే వాళ్లం. ప్రస్తుతం వారపు సంతలకు ఆదరణ కరువైంది. సంతల్లో సౌకర్యాలు కల్పించి బలోపేతం చేయాలి.

అర్ధ అణా నుంచి వ్యాపారం చేస్తున్నాం..

-బోడిరెడ్డి జానకమ్మ, వెదురుకుప్పం

అర్థ అణా నుంచి పచ్చికాపల్లం సంతలో వ్యాపారం చేస్తున్నాం. మేము పండించిన పంటలను ఇక్కడకు తెచ్చి అమ్ముకునే వాళ్ళం. అప్పుడు వ్యాపారం బాగా ఉండేది. నా భర్త పండించిన పంటను పచ్చికాపల్లం నుంచి తిరుపతికి తీసుకెళ్లే అణకు విక్రయించేవారు. అప్పుడు కాలాలే బాగున్నాయి. ఇప్పుడు ఆదరణకు నోచుకోక సంత వెలవెలబోతోంది. సంతల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి.

ఆదాయం తగ్గింది



వారపు సంతల్లో పంచాయతీలకు ఆదాయం తగ్గింది. రెండు చోట్ల సంత నిర్వహణపై కోర్టులో కేసులు ఉన్నాయి. వారం వారం నిర్వహించే సంతలకు ఆదరణ తగ్గింది. సౌకర్యాలు కల్పించేందుకు చొరవ తీసుకుంటాం. వేలం నిర్వహించని పంచాయతీల్లో నిర్వహణ కొటేషన్‌ను ఉన్నతాధికారులకు పంపించి ఉన్నాం. తదుపరి చర్యలు చేపడతాం.

- పురుషోత్తం, ఈవోఆర్డీ, వెదురుకుప్పం

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (JUNIOR DIVISION), CHITTOOR.
O.S.No. 160 of 2023
Between:
R. Sreeramulu Reddy, Represented by his son as General Power of Attorney Holder R. Vasudeva Reddy
....Plaintiff.
And
N. Subramanyam Reddy and 5 others
......Defendants.
SUIT SUMMONS TO THE DEFENDANT NO.2.
To
Smt. K. SRIDEVI, W/o Late K. Eswara Reddy, D/o Late K. Jayarama Reddy, D.No. 20-3-15V, Sivajyothi Nagar, Jeevakona Road, Tirupati-517501.
The Plaintiff has instituted a suit against you and others for declaration of right and title and other reliefs and you are hereby summoned to appear in person or through an advocate on **02-12-2024 at 10-30 A.M.** before the above court to answer the suit claim and to file objections if any. If you failed to appear in the above date, the matter will be decided ex-parte in your absence.
SRI. N. KESAVULU REDDY,
Advocate for Plaintiff

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (JUNIOR DIVISION), CHITTOOR.
O.S.No. 160 of 2023
Between:
R. Sreeramulu Reddy, Represented by his son as General Power of Attorney Holder R. Vasudeva Reddy
....Plaintiff.
And
N. Subramanyam Reddy and 5 others
......Defendants.
SUIT SUMMONS TO THE DEFENDANT NO.2.
To
Smt. K. SRIDEVI, W/o Late K. Eswara Reddy, D/o Late K. Jayarama Reddy, D.No. 20-3-15V, Sivajyothi Nagar, Jeevakona Road, Tirupati-517501.
The Plaintiff has instituted a suit against you and others for declaration of right and title and other reliefs and you are hereby summoned to appear in person or through an advocate on **02-12-2024 at 10-30 A.M.** before the above court to answer the suit claim and to file objections if any. If you failed to appear in the above date, the matter will be decided ex-parte in your absence.
SRI. N. KESAVULU REDDY,
Advocate for Plaintiff

IN THE COURT OF THE PRINCIPLE CIVIL JUDGE (JUNIOR DIVISION): CHITTOOR.
O.S.No.979 OF 2023
Between:
Yovan **.... Plaintiff**
And:
C. Wilson **...Defendant**
SUMMONS TO THE DEFENDANT
To :
C. Wilson, S/o Chandran,
aged about 50 years, Christian residing 197, Rama Puram Village and Post, Gudipala Mandal, Chittoor District.,
Sir,
The above Suit O.S. NO. 979 OF 2023 filed by the Plaintiff against you is Stands Posted to **16-12-2024** for your appearance before the Learned Principle Civil Judge (Junior Division), Chittoor by 10:30 A.M. Hence, you are hereby informed to appear either in person or through your Advocate by **10:30 A.M. on 16-12-2024** failing which, the matter will be decided on your absence.
Sd/-**T.PURUSHOTHAM**
Advocate for Plaintiff